క్లుప్తంగా

రైఫిల్ షూటింగ్ పోటీలకు తంగేడుకుంట విద్యార్థులు



ఎంపిక పోటీల్లో పాల్గొన్న తంగేడుకుంట విద్యార్థులు

ఓడీచెరువు : తంగేడుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు అండర్-14, 17, 19 విభాగాల్లో రాష్ట్రస్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేష్ తెలిపారు. ఎంపికైన వారిలో సారిక, మహిత, లక్ష్మీకాంత, లహరి, రక్షిత, హారిక, వెన్నెల, తానేశ్వర్‌రెడ్డి, విశ్వనాథాచారి, విష్ణువర్ధన్ ఉన్నారన్నారు. వీరి ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రికార్డు అసిస్టెంట్ మృతి



మృతుడు రమేశ్

పుట్టపర్తి: బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేశ్ (45) సోమవారం ఆకస్మికంగా మృతి చెందారని ప్రిన్సిపాల్ మగ్బూల్ హుస్సేన్ తెలిపారు. ఈయనకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారన్నారు. రమేశ్ అంత్యక్రియలకు రూ.25 వేలు అందించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

హుండీలో నగదు చోరీ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సిద్దయ్యగుట్టలోనున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోకి ఆదివారం రాత్రి దుండగులు ప్రవేశించారు. హుండీని పగులగొట్టి.. అందులోని రూ.3వేల దాకా నగదును అపహరించుకుపోయారు. గతంలో కూడా ఒకసారి ఇలాగే జరిగిందని ఆలయ కమిటీ సభ్యులు జయశ్రీ, నరసింహులు తెలిపారు. చోరీ ఘటనపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

లో ఓల్టేజీ సమస్యపై నిరసన



సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న వినియోగదారులు

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలోని రమణ స్కూల్ సమీపంలోని విద్యుత్ వినియోగదారులు లో ఓల్టేజీ సమస్యపై సోమవారం సబ్ స్టేషన్ వద్దకెళ్లి నిరసన తెలిపారు. సామర్థ్యానికి మించి కనెక్షన్లు ఇవ్వడం వల్ల లో ఓల్టేజీ ఏర్పడి విద్యుత్ మోటర్లు, ఫ్యాన్లు, మిక్సీలు దెబ్బతింటున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఏఈ, డీఈలకు తెలిపినా సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులతో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి



కేతిరెడ్డిని సన్మానిస్తున్న అనుబంధ విభాగాల అధ్యక్షులు

- అనుబంధ విభాగాల అధ్యక్షులకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పిలుపు

బత్తలపల్లి: గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అనుబంధ విభాగాల బత్తలపల్లి మండల అధ్యక్షులుగా ఎంపికైన మండల నరసింహులు (బీసీ సెల్), కె.చైతన్యరెడ్డి (విద్యార్థి విభాగం), ఎం.రమాదేవి (మహిళా విభాగం), కొండారుపల్లి ఈశ్వరయ్య (కల్చరల్ వింగ్), బ్యాల్ల పెద్దయ్య (ఆర్టీఐ వింగ్), అక్కిం దామోదర్ (ఎస్సీ సెల్) సోమవారం కేతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి గజమాలతో సత్కరించారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన తమకు తగిన గుర్తింపునిచ్చి, కీలక బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. అంతకు ముందు బత్తలపల్లి నుంచి కేతిరెడ్డి ఇంటి వద్దకు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేతిరెడ్డి మాట్లాడుతూ గత జగన్ ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేసి ప్రజల గుండెల్లో గూడుకట్టుకుందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హామీలను విస్మరించడంతో ప్రజల్లో అసంతృప్తి మూటగట్టుకుందన్నారు. కూటమి సర్కారు ప్రజా వ్యతిరేక విధానాలను తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీపై కూటమి నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఆధారాలతో తిప్పికొట్టాలన్నారు. పార్టీ బలోపేతమే అందరిలక్ష్యం కావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్, నియోజకవర్గ కల్చరల్ వింగ్ ప్రెసిడెంట్ షరాబ్ యోగానంద ఆచారి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్‌కుమార్, మాజీ సర్పంచు చెడిపోతుల గోపాల్, నాయకులు బిల్లే సూరి, బండి వీరనారప్ప, మండల నారాయణ, వెంకటరెడ్డి, ఉపేంద్రరెడ్డి, అక్కిం ముసలప్ప, మండల హరి, మండల వీరప్రసాద్, దాసరి విజయ్, ఈరప్ప, ఎంపీటీసీ నరసింహులు, కొంకా ప్రసాద్, గవ్వల రమేష్, సాకే సురేష్, చెడిపోతుల నారాయణస్వామి, సాకే కిరణ్, గంటాపురం అప్పస్వామి, మండల సతీష్, సూరీ, నవీన్, నరసింహ, వెంకటేష్, చిన్నా, జగన్ పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేతిరెడ్డికి సన్మానం

ముదిగుబ్బ: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు ఇటీవల అధ్యక్షులుగా ఎంపికైన వారు సోమవారం ధర్మవరంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని నివాసంలో ఘనంగా సన్మానించారు. కేతిరెడ్డి మాట్లాడుతు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఇందుకూరి నారాయణ రెడ్డి, నాయకులు కిరణ్‌మోహన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేతిరెడ్డిని కలిసిన క్లస్టర్ కమిటీ సభ్యులు

ధర్మవరం: వైఎస్సార్‌సీపీ మున్సిపల్ క్లస్టర్ కమిటీ సభ్యులు సోమవారం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం, శాలువాలతో సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మున్సిపల్ క్లస్టర్-1 కమిటీ సెక్రటరీ గుండా ఈశ్వరయ్య, దాసరి రాము, పల్లా రామంజి, నాగిరెడ్డి, గిరకల లచ్చి, ఈడిగ చంద్ర, లక్ష్మీకాంతయ్య, శీలా రాజు, శీలా దుర్గలు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డిని కలిసిన మున్సిపల్ క్లస్టర్ కమిటీ సభ్యులు

సచివాలయ ఉద్యోగుల సమ్మె నోటీసు



కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న ఉద్యోగులు

ధర్మవరం: సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు సోమవారం మున్సిపల్ కమిషనర్ సాయికృష్ణకు సమ్మె నోటీసును అందజేశారు. హక్కుల సాధనలో ఉద్యోగుల ఐక్యతే ప్రధాన బలమన్నారు. ఉద్యోగుల ప్రొబేషన్ కాలానికి సంబంధించిన రెండు నోషనల్ ఇంక్రిమెంట్లను మంజూరు చేయాలని, ప్రమోషన్ లేకుండా ఒకే క్యాడర్‌లో ఆరు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమెటిక్ అడ్వాన్స్‌డ్ స్కీమ్ కింద ఒక స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలన్నారు. ఇంటింటికీ తిరిగి చేసే సేవలు, సర్వేల నుంచి విముక్తి కల్పించాలన్నారు.

బత్తలపల్లి: తమపై మోపిన అనవసర భారం తొలగించాలని, సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసి.. దానిని సమర్థవంతంగా తీర్చిదిద్దాలని డిమాండ్ చేస్తూ బత్తలపల్లిలో సచివాలయ ఉద్యోగులు ఎంపీడీఓ నరసింహనాయుడుకు సమ్మె నోటీసు అందజేశారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళన

రామగిరి: తమ జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం ఆటలాడుతోందని సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సచివాలయ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవ సమస్యకు కారణం అవుతున్న వనమిత్ర డోర్‌టుడోర్ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నామన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ ప్రసాద్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది శ్రీలక్ష్మి, గాయత్రి, రమేష్, విజయ్‌బాబు, చంద్రకళ, ఆనంద్ సాయి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగేలా చూడాలి

గాండ్లపెంట: బడుగు, బలహీనవర్గాలకు చేయూతనిస్తూ, వారి జీవన విధానాల్లో మార్పులు తీసుకొచ్చిన ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని ఆర్డీటీ మహిళా సంఘాల సభ్యులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆర్డీటీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ వైఎస్సార్ కూడలి మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం తహసీల్దార్ బాబురావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ డివిజనల్ కమిటీ సభ్యుడు రాంప్రసాద్‌నాయక్, దేవేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

ధర్మవరం అర్బన్: ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లిన కుమారుడు అదృశ్యమయ్యాడని తారకరామాపురానికి చెందిన రేకట్ల పెద్దన్న సోమవారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డిగ్రీ వరకు చదువుకున్న తన కుమారుడు సునిల్‌కుమార్ చీరలకు పాలిష్ చేస్తూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడని పేర్కొన్నాడు. అయితే అతనికి సినిమాలకు కథలు రాయడం ఇష్టమని.. ఛాన్స్ కోసం విజయవాడ వెళ్తానని తరచూ అడిగేవాడని తెలిపాడు. ఈ నెల 6న విజయవాడలో సెలెక్షన్స్ ఉన్నాయని తెలపడంతో.. తాను వద్దని చెప్పినా వినకుండా గొడవపడి బయటకు వెళ్లిపోయాడని, తర్వాత తిరిగి రాలేదని పేర్కొన్నాడు. ఫోన్ కూడా స్విచాఫ్ వస్తోందని తెలిపాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ రెడ్డప్ప చెప్పారు.

డీఏలు వెంటనే విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ధర్మవరం అర్బన్: ఉపాధ్యాయ, ఉద్యోగ ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ డీఏలు, ఐఆర్ వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రరెడ్డి, బలరాముడు తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద సోమవారం ఏపీటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీఓ మహేష్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ పట్టణాధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి అంజినాయక్, మండల అధ్యక్షుడు శివానంద, కార్యదర్శి ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: ఉపాధ్యాయులకు నాలుగు పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసనలో వారు మాట్లాడుతూ డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి, మెమో నంబర్ 57ను తక్షణం అమలు చేయాలన్నారు. 12వ పీఆర్‌సీని నియమించి ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. ఈహెచ్‌ఎస్ పరిమితి రూ.25 లక్షలకు పెంచాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆదిబయన్న, ఉపాధ్యక్షులు రాజశేఖర్, నారాయణ, జనార్దన్, రమణారెడ్డి, ఉషారాణి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి

నల్లచెరువు: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపై దృష్టి సారించాలని ఎంపీపీ రమణారెడ్డి అధికారులను కోరారు. సోమవారం ఆయన అధ్యక్షత ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న తరుణంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పదోన్నతి పొందిన ఎంపీడీఓ రఘునాథ గుప్తా, ఈఓఆర్డీ శకుంతలను ఎంపీపీతో పాటూ స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జమానుల్లా ఖాన్, ఏఓ రామకృష్ణ సర్పంచ్ పంచరత్నమ్మ, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

తాడిమర్రి: ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి మండల అధికారులకు సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులు వారి, వారి శాఖలకు సంబంధించిన కార్యక్రమాలను వివరించారు. వ్యవసాయాధికారి శేఖర్‌నాయక్, తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, వెలుగు ఏపీఎం సాంబశివుడు, వైస్ ఎంపీపీలు బీసాని లింగమ్మ, యర్రగంగు కృష్ణమ నాయుడు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఎంఈఓ కృష్ణమోహన్, ఏఎస్ఐ గంగాధర్, ఏపీఓ అనిల్ కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి మహ్మద్ యూనస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

తలుపుల: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ రఫీనాయక్ అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పోలప్ప తెలిపారు. సమావేశానికి మండలస్థాయి అధికారులు తమ శాఖల పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఘనంగా మోక్ష గుండం విశ్వేశ్వరయ్య జయంతి



విద్యాసామగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: స్థానిక తారకరామాపురం మోడల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మోక్ష గుండం విశ్వేశ్వరయ్య 164 జయంతిని ఘనంగా నిర్వహించారు. అదే విధంగా అరబిందఘోష్ జయంతి వేడుకలను కూడా జరుపుకున్నారు. వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు దాత అన్నం లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో విద్యా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ఏపియూఎస్ జిల్లా గౌరవ సలహాదారుడు అన్నం అరవింద్, వీహెచ్ విభాగ్ కార్యదర్శి పలిచెర్ల వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్, దేవరకొండ రామాంజులు, ఉపాధ్యాయులు హర్షవర్ధన్, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సేవా పక్షోత్సవాలు

పుట్టపర్తిటౌన్: జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ రెండు వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు బీజేపీ నాయకులు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సోమవారం పుట్టపర్తిలోని బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు కళ్యాణ్‌అధ్యక్షత సమావేశం ఏర్పాటు చేసి సేవాక్షోత్సవాల కరపత్రాలు విడుదల చేశారు.

డ్రెయినేజీ సమస్యపై వినతి

తనకల్లు: చీకటిమానిపల్లిలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ సయ్యద్ షాబుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. డ్రెయినేజీలు లేక మురుగునీరు వీధుల్లో పారుతోందన్నారు. దోమలు బెడద ఎక్కువై ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.

లేబొరేటరీ అసోసియేషన్ జాయింట్ కార్యదర్శిగా దినేష్

ధర్మవరం అర్బన్: నవ్యాంధ్రప్రదేశ్ ప్రైవేటు మెడికల్ లేబొరేటరీ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ కార్యదర్శిగా ధర్మవరం పట్టణానికి చెందిన వి.దినేష్‌బాబు ఎంపికయ్యాడు. ఆదివారం మంగళగిరిలోని ఆర్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడుగా శ్రీహరిబాబు, జాయింట్ కార్యదర్శిగా దినేష్బాబు, ఈసీ మెంబర్లుగా ప్రకాష్, రవి ఎన్నికయ్యారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ కోరారు. ఈ మేరకు ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆర్డీఓ సువర్ణను కలిసి వినతిపత్రం అందజేశారు.

వ్యక్తిపై హత్యాయత్నం

పుట్టపర్తి అర్బన్: మండలంలోని కర్ణాటక నాగేపల్లికి చెందిన ఎరికల వెంకటేష్‌పై అదే గ్రామానికి చెందిన సుధాకర్ మద్యం మత్తులో సోమవారం కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. క్షతగాత్రుడిని కుటుంబసభ్యులు వెంటనే సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అయితే ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు తెలిపారు. వివాహేతర సంబంధమే దాడికి కారణంగా తెలుస్తోంది.

సీఐటీయూ నుంచి మాబున్నీసా తొలగింపు

కదిరి టౌన్: సీఐటియూ నుంచి నాయకురాలు మాబున్నీసాను తొలగించినట్లు జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు, నాయకులు జగన్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నందున తొలగిస్తున్నట్లు సోమవారం జరిగిన పట్టణ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

జేవీవీ రాష్ట్ర కార్యదర్శిగా ఆదిశేషు

ధర్మవరం అర్బన్: జనవిజ్ఞానవేదిక రాష్ట్ర కార్యదర్శిగా ధర్మవరానికి చెందిన డాక్టర్ ఆదిశేషు ఎంపికయ్యారు. ఇదివరకు జిల్లా కార్యదర్శిగా పనిచేసిన తనను ఈ నెల 13, 14 తేదీల్లో విజయనగరంలో జరిగిన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేశారని తెలిపారు.

స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

తలుపుల: కుర్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వి.దేవి, జి.లక్ష్మీప్రసన్న, జి.గౌరి అండర్-14 ఫ్రీస్టైల్ విభాగంలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు విజయభారతి, పీడీ సాయిక్రిష్ణ తెలిపారు. వీరిని సోమవారం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

సంక్షిప్త సమాచారం

టీకా వేయించండి

బత్తలపల్లి: రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని ధర్మవరం పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకుడు డాక్టర్ బి.చంద్రశేఖర్ సూచించారు. సోమవారం గంటాపురంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ఉచితంగా వేసే కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

ద్విచక్ర వాహనాల ఢీ

కనగానపల్లి: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముత్యాలు అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం నుంచి అతడిని బెంగళూరుకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మోతాదుకు మించి వాడొద్దు

నల్లమాడ: రసాయన ఎరువులు, పురుగు మందులను మోతాదుకు మించి పంటలకు వాడరాదని ఏపీఎస్ఓపీసీఏ అధికారి డి.వెంకటేష్ రైతులకు సూచించారు. ఉత్తమ వ్యవసాయ యాజమాన్య పద్ధతుల కోసం రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థకు నమోదు చేసుకున్న 30 మంది రైతులకు చెందిన పంట పొలాలను సోమవారం ఆయన పరిశీలించారు. వెంకటేష్ మాట్లాడుతూ విత్తన ధ్రువీకరణ ప్రాధాన్యతను తెలియజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ముదిగుబ్బ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని పట్నం ఎస్ఐ జయరాంనాయక్ వాహనదారులకు సూచించారు. సోమవారం ఆయన తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు.

స్వస్థ్ నారి పరివార్ అభియాన్‌పై అవగాహన

నల్లమాడ: రెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం స్వస్థ్ నారి పరివార్ అభియాన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వస్థ్ నారి పరివార్ అభియాన్‌లో భాగంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు దేశవ్యాప్తంగా అన్ని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో హెల్త్ క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ దీప్తి తెలిపారు.

ఇసుకను తరలిస్తే చర్యలు

బత్తలపల్లి: ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్ హెచ్చరించారు. సోమవారం సాయంత్రం గుమ్మలకుంట వద్ద సీఐ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ నిర్వహించారు. బిల్లులు లేకుండా అనంతపురానికి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను గుర్తించి, సీజ్ చేశారు.

గడువులోగా పూర్తి చేయండి

ధర్మవరం రూరల్: ఎరువులు, విత్తనాల పరీక్షలను గడువులోపు పూర్తి చేసి ఫలితాలను సమర్పించాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీరామునాయక్ ప్రయోగశాల అధికారులకు సూచించారు. సోమవారం ధర్మవరం మార్కెట్ యార్డ్‌లోని ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌ను ఏడీఏ లక్ష్మానాయక్‌తో కలిసి తనిఖీ చేశారు.

జ్వరపీడితులకు వైద్య సేవలు

పుట్టపర్తి: సీజనల్ వ్యాధులు ప్రబలిన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, చికిత్సలందిస్తున్నట్లు బుక్కపట్నం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు సురేష్ కుమార్ తెలిపారు. ఆయన సిబ్బందితో కలిసి సోమవారం లింగప్పగారిపల్లిలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రస్తుత సీజన్‌లో విషజ్వరాల బారిన పడిన వారిని గుర్తించి వైద్యం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లింగా రామమోహన్ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.